క్లుప్తంగా

12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తుర్కయంజాల్: ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలందరికీ ఈనెల 12వ తేదీన జిల్లా వ్యాప్తంగా నట్టల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు వేయనున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 80,9357 మంది పిల్లలు ఉన్నారని, వీరికి 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 406 మంది వైద్యాధికారులు, 1368 మంది ఏఎన్‌ఎంలతో పాటు ఇతర ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్ల సహాయంతో మాత్రలను పంపిణీచేయనున్నామని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన ఆమనగల్లు లిటిల్ స్కాలర్స్ విద్యార్థులు నితీష్, దీక్షితారెడ్డి, శృతిను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. ఆమనగల్లులో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థులు నితీష్, దీక్షితారెడ్డి, శృతి ప్రథమస్థానంలో నిలిచి ఈనెల 4న తుర్కయాంజల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో స్కూల్ ఆవరణలో విద్యార్థులను పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపాల్ శ్రీశైలం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ్, యాదయ్య, చలమంద, అయూబ్, రేవతి, రమాదేవి, నవ్య, స్వప్న తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



తలకొండపల్లి: తలకొండపల్లి మండల పీఎస్ నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను గురువారం గట్టుఇప్పలపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గాదె రేణురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు.. విష్ణు, అనంతరాములు, రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలను మూసేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న యువత

యాచారం: మద్యానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని బెల్టు దుకాణాలను వెంటనే మూసేయాలని నందివనపర్తి గ్రామ యువత గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో 20కి పైగా బెల్టు దుకాణాల్లో ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు పలుమార్లు ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వారు వాపోయారు. ఇప్పటికైన పట్టించుకోకపోతే బెల్టు దుకాణాలపై దాడులు చేసి వాటిని మూసివేయిస్తామని వారు హెచ్చరించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని కామినేని ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా గ్రామస్తులు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోగికార్ రమేష్, కొండాపురం నాగరాజు, విక్రమ్, గడ్డం దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: సీఐ

కడ్తాల్: ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ శివప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తలకొండపల్లి చౌరస్తా వద్ద వారు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారుడు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ లేకుండా ప్రయాణించరాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జాతీయ రహదారిపై నిరంతరం పోలీసుల నిఘా కొనసాగుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూములకు రక్షణేది?

- సర్వేల్లో వ్యత్యాసాలతో తరచూ వివాదాలు
- అన్యాక్రాంతమవుతున్న విలువైన భూములు
- రీసర్వే చేసి హద్దులు నిర్ణయించాలంటున్న ఆలయ సిబ్బంది, భక్తులు



ఆలయ భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

కడ్తాల్: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూములకు రక్షణ కరువైంది. ఈ భూములకు సంబంధించి పలుమార్లు సర్వే నిర్వహించినప్పటికీ సర్వేల్లో వ్యత్యాసాలు ఉండటం, సమీప పొలాల వారి అభ్యంతరాలతో తరుచూ వివాదాలకు దారితీస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. కడ్తాల్‌లోని చెన్నకేశవస్వామి ఆలయం పురాతన ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. కడ్తాల్ గ్రామంలో ఈ ఆలయానికి సంబంధించి సుమారు 40 ఎకరాలకు పైగా భూమి ఉండగా.. పలుచోట్ల ఆలయ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ క్రమంలో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూములను రక్షించేందుకు గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఆలయ భూములకు సర్వే చేపట్టినప్పటికీ.. నేటికి సమస్య ఒక కొలిక్కిరావడం లేదు.

నలభై ఎకరాలకు పైగా..

కడ్తాల్ శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం కడ్తాల్ గ్రామంలో అత్యంత విలువైన నలభై ఎకరాలకు పైగా సువిశాల భూములు ఉన్నాయి. ఈ భూములు కడ్తాల్ గ్రామంతో పాటు అన్మాస్‌పల్లి గ్రామశివారు, పోచమ్మగడ్డ తండా సమీపంలో ఉన్నాయి. తాజాగా ఇక్కడ రియల్ వ్యాపారం జోరందుకోవడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం రూ.కోటి నుంచి రూ.రెండు కోట్లు పలుకుతోంది. ఆలయానికి సంబంధించిన భూముల వివరాలు...

ఆయా భూముల్లో..

ఆయా సర్వే నంబర్లలో 41.29 ఎకరాలకు పైగా ఆలయానికి భూములున్నాయి. సర్వే నంబర్లు 76, 213, 214, 841, 848, 849లో భూములను ఆలయ అర్చకులుగా ఉన్న కుటుంబాలు సాగుచేసుకుంటూ ఆలయంలో పూజలు నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నారు. సర్వే నంబర్ 120, 125, 130లో గల భూములను సమీప పోచమ్మ గడ్డ తండా గిరిజనులు సాగు చేస్తూ.. బ్రహ్మోత్సవాల సమయాల్లో కొంత మొత్తం కౌలు రూపేణ డబ్బు చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 120, 125, 130లో కొంతభూమి రోడ్డు విస్తరణ కోసం తీసుకున్నారు. మరికొంత భూమి కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమించారు.

పలుమార్లు సర్వే చేసినా..

ఆలయ భూములను సర్వే చేయాలని స్థానికులు,

సర్వే నంబర్లు	భూములు(ఎకరాల్లో)
76	6-05
120	15-31
125	9-32,
130	3-06
213	1-39
841	2-09
848	1-03
849	1-24

భక్తులు నాలుగైదు సంవత్సరాలుగా దేవాదాయ శాఖ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఇదే విషయమై పలుమార్లు రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు కూడా చేశారు. ఈ మేరకు 2020 సంవత్సరంలో సర్వే నంబర్ 120, 125, 130లలో డీ.ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ఆలయ భూములు ఆక్రమణలకు గురైనట్లు రిపోర్టు కూడా ఇవ్వడం జరిగింది. ఈ మేరకు అప్పట్లో ఆలయ అధికారులు, నిర్వాహకులు ఆలయ భూములకు కంచె ఏర్పాటు చేస్తుండగా.. సమీప పట్టాదారులు ఆక్రమించిన భూమిని వదిలిపెట్టకుండా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయ భూములు తాము అక్రమించలేదని సమీప పట్టాదారులు 2023 మార్చిలో మరో డీ.ఐతో సర్వే చేయించి హద్దులు నిర్ణయించుకున్నట్లు పంచానామ రిపోర్టు తయారు చేసి ఆలయ అధికారులకు ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇద్దరు సర్వే అధికారులు ఒకే సర్వే నంబర్‌కు వేరువేరు హద్దులు నిర్ణయించి రిపోర్టు ఇవ్వడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యింది.

భూములను కాపాడండి..

ఈ విషయమై జనవరి నెలలో ఆలయ నిర్వాహకులు జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన అడి షనల్ కలెక్టర్ పకడ్బందీగా సర్వే చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గత నెలలో సర్వే నంబర్ 125లో సర్వే నిర్వహించి ఆక్రమణలు గుర్తించి.. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 120లో సర్వే చేస్తున్న సందర్భంలో సమీప పట్టాదారులు మరోసారి అభ్యంతరం వ్యక్తం చేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చి సర్వే నిలిచిపోయింది. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే సర్వే పూర్తిచేయాలని, సర్వే నంబర్ 76, 120, 130లో జిల్లా ల్యాండ్ ఏడీ ద్వారా సర్వే చేపట్టి విలువైన ఆలయ భూములను రక్షించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

భూములకు రక్షణ కల్పించాలి



శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూములకు సంబధిత దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో పాటు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములను రక్షించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ ఉన్నతాధికారులదే. తరుచూ సమస్యను పెండింగ్‌లో పెట్టడం తగదు. ఆలయానికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం సమగ్ర సర్వే నిర్వహించి దేవుడి భూములకు రక్షణ కల్పించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, కడ్తాల్



కడ్తాల్: ప్రశంశాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ప్రతిభ గుర్తింపునకు చెకుముఖి పోటీలు

- ఏంఈఓ సర్దార్‌నాయక్

కడ్తాల్: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకే చెకుముఖి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏంఈఓ సర్దార్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెక్‌ముఖి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పోటీల్లో మండల పరిధిలోని 9 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో వారికి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తెలుగు మాధ్యమంలో కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ఎక్వాయిపల్లి పాఠశాల నిలిచింది. ఆంగ్లమాధ్యమంలో ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో రావిచేడ్ ఉన్నత పాఠశాల నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ సర్దార్‌నాయక్ మాట్లాడుతూ.. టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో మూఢనమ్మకాల నిర్మూళనపై అవగాహన కలుగుతుందని, తార్కిక ఆలోచన మెరుగుపడుతుందని తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలల విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికయ్యారని.. ఆదివారం తుర్కయాంజాల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. నోడల్ అధికారి జంగయ్య పోటీల్లో విజేతలైన విద్యార్థులను అభినందించి ప్రశాంశాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు అరుణ, రామనాథం, జంగయ్య, ఉపాధ్యాయులు.. శ్రీనివాసరావు, జైపాల్, సుఖ్‌జీవన్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రత్నమాల, రమేశ్, మల్లయ్య పాల్గొన్నారు.



ఆమనగల్లు: విజేతలకు బహుమతులు అందించిన ఉపాధ్యాయులు

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రాములయ్య ప్రారంభించారు. పోటీలకలో ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియంలో ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పవన్‌కళ్యాణ్, అజయ్‌కుమార్, అజయ్, ప్రభుత్వ తెలుగు మీడియంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఐశ్వర్య, ఆయేష, సాధిహా, ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం విభాగంలో లిటిల్‌స్కాలర్స్ హైస్కూల్ విద్యార్థులు నితీష్, శృతి, దీక్షిత్‌రెడ్డి మొదటిస్థానంలో నిలిచి జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. మండలస్థాయి పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా కోశాధికారి చుక్క అల్లాజీగౌడ్, ఉపాధ్యాయులు మహేశ్, భార్గవి, మహమూద్, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలం, విఠల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన కమిషనర్



శ్రమదానం చేస్తున్న కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: తుర్కయంజాల్–నాదర్‌గుల్ రోడ్డులో ఏర్పడిన గుంతలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ గురువారం సిబ్బందితో కలిసి శ్రమదానం చేసి పూడ్చివేశారు. అన్ని పనులు ప్రభుత్వం, అధికారులు, మున్సిపల్ సిబ్బందినే చేయాలనే టార్గెట్ పెట్టుకోకుండా.. ఖాళీ సమయాల్లో శ్రమదానం వంటి కార్యక్రమంలో యువత, ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

15 సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు ఫోన్లు అందజేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: రూ.3.5 లక్షలు విలువ చేసే 15 సెల్‌ఫోన్స్‌ను ఇబ్రహీంపట్నం పోలీసులు రికవరీ చేశారు. స్థానిక సీఐ అంజనేయులు, ఎస్‌ఐ మారయ్య మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం ... ఇటీవల కాలంలో దొంగిలించబడిన, పడిపోయిన ఫోన్లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల మేరకు క్రైం సిబ్బంది దర్యాప్తు చేపట్టగా 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3.5 లక్షల విలువ ఉంటుందని, బాధితులకు ఈ ఫోన్లను అందజేసినట్లు చెప్పారు. దొంగిలించిన వ్యక్తుల నుంచే కాకుండా అట్టి ఫోన్లను కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి కూడా రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యగా అంగడిబజారుల్లో, రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక బృందాలను నిఘాలో ఉంచనున్నట్లు సీఐ వెల్లడించారు.

సర్పంచ్‌ల సేవలు అభినందనీయం

- పాలకవర్గం సభ్యులను సన్మానించిన నాయకులు

ఆమనగల్లు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులను నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని రాంనుంతలలో సర్పంచ్ సోన శ్రీనునాయక్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మేడిగడ్డతండాలో సర్పంచ్ అమర్‌సింగ్, పాలకవర్గ సభ్యులను కేఎస్ఆర్ యువసేన నాయకుడు విజయ్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ గోదాదేవి సత్యం దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాలెపల్లిలో సర్పంచ్ శ్రీనయ్యను నాయకులు సత్కరించారు.

గడ్డమల్లయ్యగూడలో..

యాచారం: మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామ పాలకవర్గాన్ని గురువారం పంచాయతీ కార్యాలయంలో స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అచ్చెన జంగయ్య, వార్డు సభ్యులను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పాలకవర్గాలకు సన్మానం

కడ్తాల్: పదవీకాలం పూర్తికావడంతో మండల పరిధిలోని మైసిగండి, కడ్తాల్, గోవిందాయిపల్లి, మక్తమాధారం, ఎక్వాయిపల్లి తదితర గ్రామపంచాయితీ పాలకవర్గం సభ్యులను, సర్పంచ్, ఉప సర్పంచ్‌లను.. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు గురువారం ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు తులసీరాంనాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్, సుగుణ సాయిలు, సులోచన సాయిలు, ఉప సర్పంచ్‌లు ఎల్లాగౌడ్, రామకృష్ణ, గణేశ్, రాజారాం, వార్డు సభ్యులు నాయకులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం

తలకొండపల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లోని రైతువేదిక భవనంలో సర్పంచ్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపిపి శ్రీనివాసుయాదవ్‌తో పాటు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం త్వరగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లాక్‌డౌన్ సమయంలో వారు అందించిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత శ్రీనివాసుయాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, ఉప సర్పంచ్ అజీజ్, కార్యదర్శులు శరత్, జైశాలిని, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, హెచ్‌ఎంలు లీల, ప్రసాద్, మాజీ రైతు కమిటీ మండల కోఆర్డినేటర్ దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు లింమ్మ, ఈశ్వర్ నాయక్, హైమావతి, రమేష్, విజయారెడ్డి, నరేందర్‌గౌడ్, కారోబార్ రవి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు ప్రత్యేకాధికారులు

- ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్



మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో శుక్రవారం నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానున్నది. అబ్దుల్లాపూర్ మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలకు 18మంది ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాలవారీగా నియమితులైన ప్రత్యేకాధికారులు వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్-మమతాబాయి(ఎంపీడీఓ), అనాజ్‌పూర్-రవీందర్ దత్ (తహసీల్దార్), బాటసింగారం-పావని (ఏఈ, మిషన్ భగీరథ), తారామతిపేట-కవిత (వ్యవసాధికారిణి), కుత్బుల్లాపూర్-సూర్యతేజ (ఏఈ, పంచాయతీరాజ్), మజీద్‌పూర్-తప్సీర్‌రజా (ఏఈ, ఇరిగేషన్), గౌరెల్లి-వినిత(సీడీపీఓ), బండరావిరాల-వినోద(ఎంపీఓ), కవాడిపల్లి-శ్వేత (ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్), లష్కర్‌గూడ-నజీ (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), బాచారం-వనజ (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), చిన్నరావిరాల-స్వప్న (ఎంపీఎస్ఓ), గండిచెరువు-అబ్దుల్‌అజీం (సూపరింటెండెంట్), ఇనాంగూడ- భిక్షపతి (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), గుంతపల్లి-రామకృష్ణ (డిప్యూటీ తహసీల్దార్), పిగ్లీపూర్- ఎండీ నిజాముద్దీన్ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), బలిజగూడ-నరేందర్‌రెడ్డి (ఏపీఎం ఐకేపీ), జాఫర్‌గూడ-లక్ష్మన్ (ఏఈఓ)ను నియమించారు.

యాచారం మండలంలో..

యాచారం: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో నేటి నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. వారి వివరాలు.. యాచారం-విజయలక్ష్మి (ఎంపీడీఓ), మేడిపల్లి-కె.ఉమారాణి (ఎంపీఓ), నందివనపర్తి- శ్రీకాంత్‌రెడ్డి (తహసీల్దార్), మాల్- శ్రీనివాస్ (డీఈఈ పంచాయతీరాజ్), కుర్మిద్ద-బి.రాజు (డీఈఈ మిషన్ భగీరథ), చింతపట్ల-కె. కీర్తిసాగర్ (ఉప తహసీల్దార్), గునుగల్-సందీప్‌కుమార్ (వ్యవసాయాధికారి, నల్లవెల్లి-ఎండీ ఉస్మాన్ (ఏఈఈపంచాయతీరాజ్), కొత్తపల్లి-ఎస్.రజిత(ఏఈఈమిషన్ భగీరథ), చౌదర్‌పల్లి- కె.సునీత(ఏఈఈ ఇరిగేషన్), మంతన్‌గౌరెల్లి-డి. జయలక్ష్మీ(ఏఈఈ ఇరిగేషన్), చింతుల్ల-బి. రామకృష్ణ(ఆర్ఐ), తాడిపర్తి-ముజులదేవి(డీఈఈ ఇరిగేషన్), మల్కీజ్‌గూడ-ఎస్. శైలజ (ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకురాలు), గడ్డమల్లయ్యగూడ-ఈ.వసంత(ఏఈఓ), తక్కళ్లపల్లి-కె.మురళీకృష్ణ(ఆర్ఐ), మొండిగౌరెల్లి-ఎం.అరుణ(ఐసీడీఎస్‌సూపర్‌వైజర్), తమ్మలోనిగూడ-పి. తులసి (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), నస్దిక్‌సింగారం-ఎస్.సంతోష్‌కుమార్(ఏఈఓ), నానక్‌నగర్-ఎం.నిఖిత(ఏఈఓ), అయ్యవారిగూడెం-డి.కవిత(ఎంపీఎస్ఓ), కేసీతండా- ఏ.గురుప్రసాద్(ఏఈఓ), ధర్మన్నగూడెం-వెంకట్‌సుజీత్‌రెడ్డి(సీనియర్ అసిస్టెంట్), తక్కళ్లపల్లి తండా-బి.కృష్ణ(సీనియర్ అసిస్టెంట్)ను నియమించారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. వారి వివరాలు..దండుమైలారం- అన్వర్(తహసీల్దార్), రాయపోల్- వెంకటమ్మ(ఎంపీడీఓ), పోలకంపల్లికి-లక్‌పతినాయక్(ఎంపీఓ), ఎల్మినేడు-శ్రీనివాస్ (నాయబ్ తహసీల్దార్), పోచారం-ప్రణీత్(మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ), కర్ణంగూడ-అనిరుథ్‌రెడ్డి (మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ), తులేకలాన్- రాజ్యలక్ష్మీ(ఇరిగేషన్ ఏఈ), కప్పపహాడ్-వరప్రసాద్‌రెడ్డి (మండల వ్యవసాయాధికారి), చర్లపటేల్‌గూడ- శాంతిశ్రీ(సీడీపీఓ), నాగన్‌పల్లి ఇంద్రసేనారెడ్డి (పీఆర్ ఏఈ), ఉప్పరిగూడ శ్రీను(రెవెన్యూశాఖ ఎంఎస్), ముకునూర్ పల్లవి(ఐసీడీఎస్ సూపర్‌వైజర్), నెర్రపల్లి, తుర్కగూడ గ్రామ పంచాయతీలకు వ్యవసాయశాఖ ఏఈఓలు శ్రమణ్ కుమార్, రఘుపతిలను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. కాగా పై అధికారులంతా శుక్రవారం నుంచి ప్రత్యేక పాలనలో కొనసాగనున్నారు.

చైర్మన్‌గా అవకాశం కల్పించండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డికి యూత్ కాంగ్రెస్ నేత కరుణాకర్ వినతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తనకు ఆవకాశం కల్పించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంఖాల కరుణాకర్ రెడ్డి విన్నవించారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి నివాసానికి గురువారం తరలివెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. దళితబిడ్డనైన తాను 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రను పోషిస్తున్నానన్నారు. ఎంఆర్‌ఆర్ యువసేన మండల అధ్యక్షుడిగా రెండుసార్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన తనకు ఈ పదవినిస్తే యువతను ప్రోత్సాహించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శివ చిలుక మధుసూధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాట్టి అయిలయ్యతోపాటు జడల రవీందర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఆంజనేయులు, పాశం అశోక్‌గౌడ్, నీళ్లభాను తదితరులు పాల్గొన్నారు.



మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కరుణాకర్

వేంకటేశ్వర కాలనీకి బస్టాండ్ మార్చాలి

- సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: ఆరుట్ల గ్రామ చౌరస్తాలో ఉన్న బస్టాండ్‌ను వెంకటేశ్వర కాలనీకి మార్చాలని గ్రామ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఈమేరకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ చౌరస్తాలో సరిపడా స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని తెలిపారు. బస్టాండ్ చుట్టూ దుకాణాలు, బ్యాంకు కూడా ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో రద్దీగా మారుతుంది. దీంతో ఆర్టీసీ బస్సును మలపడం కష్టంగా మారింది. ఇప్పటికే పలుమార్లు ఆర్టీసీ డ్రైవర్లతో ఇతర వాహనదారులు గొడవపడ్డారని తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని వెంకటేశ్వర కాలనీకి బస్టాండ్ మార్చాలన్నారు. ప్రస్తుతం వెంకటేశ్వర కాలనీలో బస్టాండ్ కూడా నిర్మాణం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, స్థానిక నాయకులు చంద్రయ్య, రాజు, మార సురేష్ తదితరులు పాల్గొన్నారు.